# గోల్డ్ స్పాట్

మొవ్వ బాబూరావు



"రండి! రండి! రండి! తమరి రాక మాకెంతో సంతోషం సుమండి" ఎన్నడూలేని సినిమాపాట ఫక్కీలో శ్రీమతి ఆహ్వాని స్తుంటే నిశ్చేష్టుడినై అలానే ఆమె అడుగులో అడుగువేస్తూ ఇంటి సింహ ద్వారం నుండి బెడ్‌రూంలోకి చేరుకున్నాను.

"శ్రీవారు బాగా అలసిపోయినట్లున్నారు. కాళ్ళు కడుక్కురండి, వేడివేడిగా జీడిపప్పు ఉప్మా రెడీగా ఉంది. తిందురుగాని" బి.సరోజాదేవిలా ముద్దుముద్దుగా అంది.

"జీడిపప్పు ఉప్మానా!!" ఇప్పటిదాకా ఉప్మాని బొంబాయి రవ్వతోనూ, గోధుమరవ్వతోనూ చేస్తారని తెలుసుగాని జీడిపప్పుతో కూడా చేస్తారని ఎక్కడ వినలేదు ... కనలేదే!!

ఒక్కసారి హఠాత్తుగా గుర్తుకొచ్చి 'జీడిపప్పు ఉప్మా ఏంటీ! కొంపదీసి ... పొరబాటుగా వెచ్చాల కొట్టువాడు ఎవరికో అని మనకొంపకి పంపిన ఆ జీడిపప్పు పెద్ద ప్యాకెట్టు అంతా ఉప్మా రూపేణ ఖతం చేసావా ఏం ఖర్మ" నా మొహాన స్వేద బిందువులు పిల్లిపరు స్థాయికి ఎదిగాయి ఉన్నట్లుండి.

"అన్నిటికీ మీకు కంగారే! ఆ ప్యాకెట్టు నేనేం విప్పలేదు లెండి. బొంబాయి రవ్వ ఉప్మాలోనే ఇంట్లో ఉన్న జీడిపప్పులు కాస్త ఎక్కువగా వేశానంతే" అంటూ నా డౌట్‌ని క్లియర్ చేసింది నా ముద్దుల గారాల బాల స్వర్ణలత.

'ఏవండీ! రోజు చెప్పేదే అనుకోండి. మళ్ళీ చెబుతున్నాను ఒక్కక్కసారి మీరేసిన మూడు ముళ్ళు చూడండి" అంటూ మెడని వెనక్కి తిప్పింది.

"ఏం బానే ఉన్నాయి కదా" అమాయకంగా అన్నాను పక్కనే ఉన్న ఈజీ చైర్లో కూర్చుంటూ.

"అంతే లెండి! ఎన్ని ముళ్ళేసినా దానికేమైనా బలం ఉండీ ఛస్తేగా" మూతిని వంకరగా తిప్పుతూ అంది.

"నా శార్ధం! మూడు ముళ్ళల్లో ఓముడి ఆ పురోహితుడే కట్టి పారేసాడు. సర్లె! ఇలా దగ్గరకు రా! మళ్ళీ నేను బాకీ ఉన్న ఇంకో ముడిని గట్టిగా కట్టిపారేస్తాను' అన్నాను మరో ముడి వేయటానికి సిద్ధపడుతూ.

"చాల్లేండి ! మీ హాస్యాలు ! చూడండి. ఈ తాడు ఎలా పెరిగిపోయిందో ! రోజూ ఏదో ఓ టైంలో కొంత కొంత పెరిగిపోతోంది. దీన్ని ఎలా కాపాడుకుంటున్నానో ఓసారి చూడండి మీకే తెలుస్తుంది !" మెడని నా దగ్గరికి తీసుకొచ్చింది భార్యామణి.

"ఇదేమిటే? ఇది తాడా—పిన్నీసులతో అల్లిన గొలుసా!! అయినా ఇలా తెగిపోతూ ఉంటే ప్రతి సారీ పెరిగిపోతూ ఉంటే ఈ మంగళసూత్రాలు మరో గొలుసుకి ముడిపెట్టవచ్చుకదా—అయినా ఇంకా రెండు గొలుసులు బీరువాలోనే ఉన్నాయి కదా" ఏదో ఐడియా ఇచ్చినట్లన్నాను.

"అలానే చేద్దామనుకుంటున్నాను. పెరిగిపోయిన ఈ గొలుసుని అమ్మేయాలనుకుంటున్నానండి. అందుకనే మీరూ వస్తే "చంపాలాల్" షాప్‌లో ఇది అమ్మేసి వద్దాం అండీ" అంది గోముగా.

"ఒక్కసారి చల్లటిగాలి నా మొహాన వీచినట్లయింది. శ్రీమతి ఏ మూడ్‌లో ఉందో ఏమో గొలుసుని అమ్మేద్దామంది. లేకపోతే ఏ ఆడది ఒప్పుకుంటుందండి గొలుసుని అమ్మేసి డబ్బు చేసుకుందామని" ఒక్కసారి హేపీ మూడ్‌లోకి వెళ్ళిపోయాను.

"స్వర్ణా! నువ్వన్నట్లే చేద్దాం! శ్రీమతి గారి మాటని కాదంటే బ్రతకగలనా!! ఏది? ఆ జీడిపప్పు ఉప్మా పట్టుకొచ్చి కాఫీ త్వరగా పెట్టు. షాప్‌కి వెళ్ళకపోతే ఇవ్వాళ ఊరుకునేటట్లు లేవు" నాటక ఫక్కీలో అన్నాను.

నేను ఇంత త్వరలో వస్తానని అనుకొని ఉండదు శ్రీమతి. ఒక్కసారి నా మాటలకు ఉప్పొంగిపోయింది.

ఐదారువేలదాక డబ్బు వస్తుందంటే నా కాళ్ళు ఇంట్లో ఏం తిరుగుతాయి.

కాఫీ. టిఫిన్లు ముగించుకుని ఇద్దరం బయటపడ్డాం.

సగటు ఉద్యోగం —తలకుమించిన ఖర్చులు, అణుచుకోవాలన్నా అణగదొక్కుకోలేని కోరికలు. మధ్య తరగతి మందహాసం నాది.

ఉన్నంతలో జీవితాన్ని హాయిగా గడిపేస్తున్నాననే అనుకోవాలి.

అదృష్టం బావుంది కాబట్టి శ్రీమతి మంగళ సూత్రాలని వేరే గొలుసుకి ముడి పెడతానని, ఇప్పుడు పెరిగిన ఈ గొలుసుని అమ్మేయటానికి ఒప్పుకుంది. ఇహ ఫరవాలేదు. ఈ నెలలోనైనా ఓ వికాస్ పత్రం కొని పారేయొచ్చు. నా మనస్సు కేరింతలు కొడుతోంది.

నాతో వస్తున్నందుకో, లేక నన్ను ఎలాగైతే బజారుకి లాక్కుని రాగలగుతున్నాననో గర్వమో తెలీదు కాని బస్సులో కిటికీ పక్కనే కూర్చున్న స్వర్ణలత మొహం దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

నిజం చెప్పద్దూ! నాకు ఈ నగలూ, నట్రలు గురించి ఏమీ తెలిసిచావదు. మా ఆవిడే తను ఎప్పుడైనా ఇటువంటివి కొనుక్కొచ్చి, వాటి బరువులు, తూనికలు గురించి చెప్తుంటే శ్రోతలా విని ఖరీదెంతో అడిగేవాడ్ని తప్ప అది ఎంత చెప్పినా నా కర్ధమయ్యేది కాదు. ఆ బంగారు భాష అర్ధం చేసుకునే క్వాలిఫికేషన్ నాకు లేదు. అఫ్‌కోర్స్! అర్ధం చేసుకుందామనే ఉద్దేశం కూడా నాకు లేదు.

అసలు ఈసారి నన్ను కూడా తనతో తీసుకెళుతున్నందుకు కారణం కొత్తగా వస్తువు కొనేది ఏదీ లేదు కనుక, లేకపోతే వాళ్ళ అప్పచెల్లెళ్ళల్లో ఎవర్నో ఒకర్ని తీసుకెళ్ళి చక్కా కొనుక్కొచ్చేది.

అబిడ్స్‌లో మమ్మల్ని ఒదిలించుకుని ఇంతవరకూ కూర్చున్నందుకు ఫలితంగా ఇంత దుమ్ము మా మొహాన కసిగా కొట్టి ముందుకు ఉడాయించింది ఆర్.టి.సి. బస్సు.

కళ్ళు నలుపుకుంటూ ఏడడుగులు వేసేసరికి చంపాలాల్‌షాప్ రానే వచ్చేసింది.

చెప్పొద్దూ! పుట్టింటి కన్నా, చంపాలాల్‌ని ఎక్కువగా తలచుకుంటూ ఉంటుంది మా ఆవిడ అని నా నమ్మకం. ఆ షాప్‌ని దూరాన్నించి బస్సులో అబిడ్స్‌వైపు వెళుతున్నప్పుడు చూడటమే గాని ప్రత్యక్షంగా ఆ స్వర్ణలోకంలోకి అడుగుపెట్టటం ఇదే ప్రథమం. బంగారం ధర పెరిగింది. ఇప్పుడు మనం కొనేటట్లు ఉన్నామా అని కొలీగ్స్ అంటుంటే నిజమే కాబోలు అని సరిపెట్టుకునేవాడ్ని. కాని ... కాని ఇక్కడ ఆ షాపులో ఉన్న జనాన్ని చూస్తుంటే నేను విన్నమాట పొరబాటేమో అన్పించింది.

"చెప్పండమ్మా! అయ్యగారా?" నా వైపు చూస్తూ అడిగాడు అదే నవ్వు మొహం వేసుకుని.

"ఈ వెధవకి నేను దీని నౌకర్లా కనిపిస్తున్నానా ఏం ఖర్మ" లోపలే గొణుక్కున్నాను.

'అవును' అంటూ పరిచయం చేసింది శ్రీమతి.

ముకుళిత హస్తాలతో అతను దణ్ణం పెడుతూంటే నేనూ చేతులు జోడించాను.

"ఏమమ్మా! ఏం కొంటారు .. నెక్లెసా, గొలుసా, రింగా ..." హోటల్ సర్వర్ మెనూ వల్లించినట్లు సీస పద్యంలా చెప్పుకుపోతున్నాడు.

"ఇప్పుడు అవన్నీ ఏం లేవులే" అంటూ కాసింత సిగ్గుపడింది మా ఆవిడ.

"నువ్విలా సిగ్గు పడిపోకు. ముందు మనం వచ్చింది ఎందుకో చెప్పి తగలడు. లేకపోతే వాడింకా ఏవైనా చదివేసి నిన్ను ఇరకాటంలో పడేయగలడు" అన్నాను కాసింత చిరాకుపడుతూ.

"సర్లెండి! ఎక్కడికెళ్ళినా మీ చిరాకు పోనిచ్చుకున్నారు కాదు. నేను మాట్లాడుతాన్లెండి" అదో విధమైన ధైర్యం చెప్పింది.

"ఈ గొలుసుని కొని మూడేళ్ళు కూడా కాలేదు. ఇదిగో ఇలా పెరిగిపోతోంది. కాస్త అతికిస్తే సరిపోతుందేమో చూడు" అంటూ పుస్తెల గొలుసుని అతని చేతికందించింది.

గొలుసు మధ్యలో ఇటూ, అటూ బ్రిడ్జిలా ఉన్న రెండు పిన్నీసులలో ఒకటి ఊడినట్లుంది. పాపం అతని చేతికి గుచ్చుకుంది. 'కిసుక్కని' లోపల అనుకుని ఉంటాడు కాని బయట పడకుండా చెరగని చిరునవ్వుతో గొలుసుని అరచేతిలో పెట్టుకుని చర్మరోగిని పరీక్షించే స్కిన్ స్పెషలిస్ట్‌లా పరీక్షించి "లాభం లేదమ్మా అతుకు పడదు, పడినా నిలవదు" అంటూ మూతి విరిచాడు.

"అయితే ఇది అమ్మేస్తే ఎంతొస్తుందో కనుక్కో" శ్రీమతి చెవికొరికాను. డైరక్ట్‌గా అతన్ని అడగలేక.

"పైసానై ఆతే సాబ్! బదులు వేరేది తీసుకోవచ్చు" అన్నాడు నావంక అదోలా చూస్తూ.

దాని చెవికొరికితే ఈయనగారికి ఎలా వినబడిందో నాకర్థం కాలేదు.

"ఇప్పుడు మనకి వేరేది ఏం కావాలి—డబ్బు తప్ప!" అన్నాను మా ఆవిడ వంకే చూస్తూ.


"దూసరా ఐటం లేవ్ సాబ్! గొలుసైనా, గాజైనా" అన్నాడు మా ఆవిడ వంకే జాలిగా చూస్తూ.

"ఏవండీ ..." నసిగింది భార్యా రత్నం వాడి జాలిగొలిపే చూపుల్ని భరించలేనన్నట్లు.

'ఏమిటే' అన్నాను విసుగ్గా.

"ఈ చేతి గాజులాంటిదే ఈ కుడి చేయికి కూడా ఉంటే బావుంటుందండి. ఎప్పట్నించో మిమ్మల్ని అడిగి చేయించుకుందామనుకున్నానండి. గొలుసు ఎలాగైనా మార్చాల్సిందే కదా! దాన్ని మార్చి గాజు చేయించుకుంటే ..." ముద్దులొలికిస్తూ పరిసరాల ప్రభావాన్ని ఆసరాగా తీసుకుని సోయగాలు వెదజల్లుతోంది భార్యారత్నం.

"అయిపోయింది. వేసేసాడు టోపీ దీని నెత్తిన. చంపాలాల్! భలేగా ట్రెనింగ్ ఇచ్చావురా మీ స్టాప్‌కి" లోలోపలే పళ్ళు పటపట లాడిపోతున్నాయి. స్వర్ణ మాటలకి ఒక్కసారి దుర్వాసుడ్నయి పోవాలనిపించింది. ఇప్పటిదాకా గొలుసు అమ్మితే వచ్చే డబ్బుని ఎలా ఇన్వెస్ట్ చెయ్యాలని ఆలోచిస్తుంటే ఈవిడగారు ఉన్నట్లుండి ప్లేట్ ఫిరా




★ సారీ రావుగారూ ! మీ ఆవిడ ఇంకా రెండురోజుల కంటే ఎక్కువ బ్రతకదు. మీరు గుండె రాయి చేసుకుని నిశ్చింతగా ఉండండి అన్నారు డాక్టర్ కృష్ణమూర్తి.

'హ' ఇరవై సంవత్సరాలుగా తట్టుకున్న వాణ్ణి. ఈ రెండురోజులు ఆగలేనా డాక్టర్ చెప్పాడు రావు ???

శ్రీకొండ,
ఎర్రబోడు

యించి ఇలా గారాలు తీస్తుంటే చచ్చేంత కోపం ముంచుకొచ్చింది. అయినా నాలోనే కోపాన్ని అతి కష్టంగా అణుచుకుంటూ "స్వర్ణా!" ఈసారి మరెప్పుడైనా గాజులు చేయించుకుందానివిలే ... ఇప్పుడు ... డబ్బు ... అంటూ నసిగాను మళ్ళీ షాపువాడు ఎక్కడ విని చస్తాడో అని.

"క్యాష్ ఇచ్చేది లేదుసార్! ఓన్లీ ఎక్స్చేంజ్" అన్నాడు నిక్కచ్చిగా.

"వీడెవడండి బాబూ! ఎంత నెమ్మదిగా మాట్లాడినా లటుక్కున పట్టేస్తున్నాడు. పాము చెవులు కాని లేవుకదా! పైగా భార్యకి ఆ మాత్రం నగలు చేయించలేవా వెధవాయి అన్నట్లు ఆ చూపులు ఒహటి!" బుర్ర గోక్కుందామంటే జేబుదువ్వెన తీసుకురాలేదని గుర్తుకొచ్చింది.

అయినా క్యాష్ ఇవ్వనంటాడేమిటి? వాళ్ళావిడ నగలు ఒకొక్కటే అమ్మి అప్పులన్నీ తీర్చిపారేసానని నా కొలీగ్ చింతలపాటి కృష్ణశాస్త్రి చాలా సార్లు అన్నాడే!! వీడేంటి ఇలా అంటున్నాడు. బుగ్గన వేలేసుకుందామనుకున్నాను.

"క్యాష్ ఇస్తే సరి! లేకపోతే అఖ్ఖర్లేదు" అన్నాను కొద్దిగా మొహమాటాన్ని విడిచిపెడుతూ.

"ఏవండీ గాజు చేయించుకుంటానండి" మళ్ళీ స్వర్ణలత గోముగానే.

"ఒసేయి మనం ముందు ఇక్కడికి వచ్చేటప్పుడు ఏం అనుకున్నాం. ఇక్కడికి వచ్చిం తరువాత నువ్విలా ఛస్తున్నావే" కోపాన్ని బాగా దిగమింగుకుంటూనే అన్నాను.

"అబ్బా! ఏం చేస్తామండి! డబ్బు ఇవ్వనంటున్నాడు కదండి"! విసురుగా అంది శ్రీమతి

"ఈ చంపాలాల్‌గాడు కాకపోతే మరో కొంపాలాల్ ఇస్తాడు. పదపోదాం!" ఐడియా ఇచ్చినట్లన్నాను.

"పైసా ఏ షాప్‌లోనూ ఇవ్వడుసార్! ఇచ్చినా సగం ఖరీదు డబ్బు కూడా రాదు. ఏదో పెద్ద ఖరారు ఇన్ఫర్మేషన్ ఇస్తున్నట్లన్నాడు ఎదురుగా ఉన్న శిఖండిగాడు.

"ఏవండి! నా మాట వినండి. డబ్బు తీసుకుంటే నిమిషాలలో ఖర్చయిపోతుంది. అందానికి పెట్టిన సొమ్ము ఎప్పటికైనా మనకే ఉపయోగపడుతుంది. అయినా మన దగ్గర బంగారపు నగ ఉంటే అది ఎస్సెట్టే కదండి". బాటిల్‌బ్బాయి పుస్తకంలోని ప్రాబ్లమ్స్ ఆ మధ్యన ఆఫీసు పరీక్షలకని ఈవిడగారి ముందు గుణించుకుంటూ చేసుకోవటం నా పొరబాటైందని ఇన్నాళ్ళకి తెలిసొచ్చింది.

"సాబ్ అచ్చా ఆద్మీ హై!" ఎన్ని గ్రాములమ్మా గొలుసు" ఇహనేను ఏమీ అడ్డుకొనటానికి తావివ్వక అన్నాడు షాపువాడు.

"పదమూడు గ్రాములండి" మా ఆవిడ. వాడి చేతిలోనే గుండ్రంగా పొదిగే కూర్చున్న గొలుసుని చూస్తూ

మళ్ళీ తూచి వేస్టేజ్ తీయాలన్నాడు.

"వేస్టేజి ఏమిటి?" అడిగాను అమాయకంగా

"ఇన్ని రోజుల్నించి అమ్మగారు ఇది వాడుతున్నారు కదా, మలినం అంటుకుని ఉంటుంది. అది



★ సైకిల్ తీసుకువెళుతున్నావు గానీ చాలా జాగ్రత్తగా తొక్కాలి. అదసలే కొత్త సైకిల్ తెలిసిందా ? సైకిల్ ఇస్తూ చెప్పాడు శ్రీను.

అబ్బే నేను ఈ సైకిల్ తీసుకువెళుతున్నది తొక్కడానికి కాదులేవోయ్ పేకాట ఆడటానికి తీసుకువెళుతున్నానంతే చెప్పాడు మిత్రుడు శంకరరావు.

వేస్టేజీ క్రింద పోతుంది సార్".

కొత్త సబ్జెక్ట్ పిల్లలకు మొదలెట్టిన టీచర్లా చెప్పాడు.

సరిపోయింది. సూది పోయిందని సోదెకు వెడితే పాత రంకులు బయట పడ్డాయిట. చూస్తుంటే అలాగే ఉంది ఈ గొలుసు వ్యవహారం కూడా అనుకున్నాను.

"అయినా మా ఆవిడ మెడా, తలా, ఒళ్ళంతా రోజూ టీ.వీ.లో అడ్వర్‌టైజ్‌మెంట్ చేసే అన్ని రకాల సబ్బులతో, షాంపూలతో రుద్దిపారేస్తుంది. ఈవిడగారి మెడమీద మలినం ఏమిటబ్బా?? అదే ఇన్‌ఫర్‌మేషన్ వాడికిద్దామనుకున్నాను గాని మళ్ళీ ఏ బంగారు సబ్బు వాడండనో సెలవిస్తే చచ్చీ ఊరుకుంటాను" అనుకుంటూ నాలో నేనే సర్దుకుపోయాను.

"ఏవండీ మీరు 'ఊ' అంటేనే నేను చేయించుకునేది" ఎస్. జానకి గొంతులా స్వరం మారుస్తూ అంది నా స్వర్ణలత.

తగలడు ఏం చేస్తాం మనస్సులోనే 'ఊ' అనుకొని బరువుగా శ్వాసపీల్చాను.

ఆ ఊపిరినే, గ్రీన్‌సిగ్నల్‌గా స్వీకరించి భర్త అంగీకారాన్ని అమలు చేయటానికి రంగంలో దిగింది శ్రీమతి.

'సార్! ఒకసారి మీరు లోపలికి వస్తారా' మర్యాదగా అన్నాడతను. లోపలికి రమ్మంటాడేమిటి? కొంపదీసి నల్లబంగారం అంటారే అదేమైనా చూపిస్తాడా ఏం ఖర్మ' నెమ్మదిగా భార్యామణితో గొణిగాను.

"అదికాదండి, మీరు మలినం ఏమిటని అడిగారు కదా! ఈ గొలుసుని వేడిచేస్తే మలినం పోతుంది. మీకు కొత్త కాబట్టి చూపిస్తానంటున్నాడు. చూసి రండి, మీకూ తెలుస్తుంది" అంటూ, గొలుసులో నుండి వేరు చేసిన రెండు పిన్నీసులను నా జేబులో పడేసింది.

"అదేమిటి, గొలుసుని వేడి చేయటం ఏమిటి? కాలిపోదూ?" అమాయకంగా ప్రశ్నించాను.

'ఆప్ ఆవ్ సాబ్' తొందర పెట్టాడు షాప్‌వాడు.

ఏం ఆవ్‌సాబో, గేదెసాబో తప్పదన్నట్లు అతని అడుగులో అడుగువేసాను. లోపల ఓ చిన్న గదిలో కాష్టం రెడీ చేసినట్లు ఓ పొయ్యిలాంటిది మండిపోతోంది. నిప్పు కణాల్లా మండుతున్న బొగ్గుల్లో తన చేతిలో ఉన్న నా భార్యామణి కంఠహారాన్ని పడేసి నాదస్వరం లాంటి ఓ పరికరాన్ని పుచ్చుకుని బూరలా ఊదసాగాడు. పక్కనే పడి ఉన్న పటకారలాంటి మరో పరికరంతో గొలుసుని నిప్పుల్లో తిరగమోతలా వేయిస్తున్నాడు. మంటల్లో చిక్కుకుపోయిన గొలుసులా ఉంది నా పరిస్థితి.

కాస్సేపటికి గొలుసు మాయమైంది. ఎటుపోయిందో, నాకర్థం కావటం లేదు. పిచ్చి చూపులు చూస్తూ అలానే నిలుచున్నాను.

ఇంతలో నిప్పు కణికల్లోనుంచి మొలత్రాడు లాంటి దాన్ని పైకి తీశాడు. సిగ్గుతో ముడుచుకుపోయిన నల్లటి పెళ్ళి కూతురిలా ఉంది ఆ తాడు.

"అవునూ! ఇందాకటి గొలుసేమయిందన్నా"ను కంగారుపడుతూ.

"ఓయి హైసాబ్ ఏ" ఆ తాడుని నా కళ్ళముందుతెస్తూ అన్నాడు. నేనీ అన్యాయాన్ని భరించలేకపోయాను. పచ్చగా ఉన్న బంగారు గొలుసు నల్లగా పాము మెలికల్లా నాముందే కనబడుతూంటే ఉక్రోషం ముంచుకొచ్చింది. అయినా ఈ నల్లటి దారాన్ని చూపిస్తూ మా ఆవిడ గొలుసంటాడేమిటి? పిచ్చిగాని ఎక్కలేదుకదా అని కంగారు పడ్డాను.

ఇద్దరం కలిసి బయటకి వచ్చాం.

మా ఆవిడ మరో అతనితో దేనిగురించో అడిగి తెలుసుకుంటోంది.

"ఒసేయి స్వర్ణా! ఇటు చూడు. ఈ నల్లదారాన్ని మన గొలుసంటున్నాడు" శ్రీమతికే వినబడేటట్లు గొంతుని ఎడ్జెస్ట్ చేస్తూ ఆవేశంగా అన్నాను.

అవునండి. అదే మన గొలుసు. కరిగిస్తే అలానే అవుతుంది. నిప్పులో పడిన ఏ వస్తువైనా ఇంతేకదండి" అదోలా నవ్వుతూ అంది.

"అయితే నేను మోసపోలేదన్నమాట" స్వేచ్ఛగా ఊపిరి పీల్చాను. చిన్నసైజు సున్నితపు త్రాసులాంటిది ఒకటి తీసుకొచ్చి ఓ ప్రక్క ముడుచుకుపోయిన ఆ నల్లదారాన్ని పడేసి మరోప్రక్క త్రాసులో చిన్న చిన్న ఆకుల్లాంటి రేకుల్ని పడేసి తూస్తున్నాడు మా గిరాకీని కైవసం చేసుకున్న ఆ చిదానందమూర్తి.

వింతగా అలానే ఆ త్రాసు కదలికలను పరిశీలిస్తున్నాను.

"చూడండి సార్!" అంటూ ఏదో నోట్లోనే మననం చేసుకుంటూ ఆ రేకుల్ని చూపిస్తూ అన్నాడు. పిచ్చాడిలా చూడటం తప్పా నాశార్థం నేనేం లెఖ్ఖగట్టగలను.

మలినం పోయిం తరువాత 12 గ్రాముల బరువుందన్నాడు.

అంటే అగ్ని పరీక్షకు నిలబడిం తరువాత ఒక గ్రాము శీలాన్ని కోల్పోయిందన్న మాట భార్యారత్నం గొలుసు.

మూడేళ్ళకి ఒక గ్రాం మలినం క్రిందపోతే ఎన్నేళ్ళకు మొత్తం బంగారం మలినమైపోతుందో అని లెఖ్ఖ వేస్తున్నాను.

ఓ కాయితాన్ని పట్టుకొచ్చి లెఖ్ఖ వేయటం మొదలెట్టాడు. 'దేఖో సాబ్' అంటూ! నేనేం దేకుతాను. దానికే వేసి చూపించు అని అందామనుకున్నాను గాని మరీ చవట దద్దమ్మ క్రింద జమకట్టాడేమో, శ్రీమతి ఏడ్చి ఛస్తుందని మారు మాట్లాడకుండా వాడు వేస్తున్న అంకెల్ని చూస్తూ కూర్చున్నాను. పన్నెండు గ్రాముల ఒరిజనల్ శీలంలో పది పర్సెంట్ తరుగన్నాడు.

"తరుగేమిటి?" అన్నాను అమాయకంగా కనురెప్పలు ఎగరేస్తూ. మా ఆవిడ వంక నవ్వుతూ చూసాడు. సార్‌కి ఏమీ తెలీదులా ఉందే అన్నట్లు

"తరుగంటాడేమిటే? ఇప్పటికే దాన్ని వేయించి ఓ గ్రాం తగ్గించాడు. మళ్ళీ పది పర్సెంట్ తరుగంటాడేమిటి? దాన్నిలా తరుక్కుతింటాడా ఏం ఖర్మ!" నేను నిగ్రహం నెమ్మదిగా కోల్పోతున్నాను.

"ఏది? ఆ గాజు ఇలా ఇవ్వమ్మా" నా మాటని ఏమీ పట్టించుకున్నట్లు లేదు.

"ఆ గాజు దేనికి! కొంపదీసి దీన్ని కూడా మళ్ళీ వేయిస్తాడా" అమిత కంగారుగా అన్నాను,

"దీని బరువు తూస్తాడు ఉండండంటూ" చేతికున్న గాజు ఊడబెరికి అతని హస్తగతం చేసింది.

మళ్ళీ రేకుల్ని తీసి గాజు బరువుని తూచి పది గ్రాములందన్నాడు.

అయితే ఇప్పుడున్న గొలుసులో పదిశాతం తరుగుతీసిన బంగారం 10.800 గ్రాములుంటుంది. ఇప్పుడు ఈవిడగారు కొత్తగాజు చేయించుకోవాలంటే పది గ్రాముల బంగారం చాలు. పోనీలే మిగిలిన 0.800 గ్రాముల బంగారానికైనా డబ్బు తీసుకోవచ్చు అనుకుని మనస్సుని సమాధానఫరచుకున్నాను.

"ఓ.కె. స్వర్ణా, పది గ్రాములతో గాజు చేయించేసుకో! మరి ఆ మిగిలిన బంగారానికైనా డబ్బు తీసుకుందామా" చమత్కారంగా అన్నాను.

"సరిపోతే మీరిచ్చిన బంగారంతోనే గాజు చేస్తాం. ఒకవేళ దానిమీద ఇంకా ఎక్కువ బంగారం పడితే దాని ధర మీరివ్వాల్సి వస్తుంది" ముందు జాగ్రత్త చెబుతూ అన్నాడు షాపువాడు.

సాధ్యమైనంత వరకు దీంట్లోనే సరిపెట్టు అన్నాను కాస్త ధైర్యం చేసి.

"అచ్చాసాబ్ అరె బాబా దో గోల్డ్‌స్పాట్ లావ్" అంటూ ఆర్డర్ వేశాడు. బిల్లు బుక్ చేతిలోకి తీసుకుంటూ.

మా ఆవిడ గర్వంగా నా వంక చూసింది సింగారం చూడరా నా బంగారు మొగుడా అన్నట్లు.

గోల్డ్ 'స్పాటు'కే వచ్చాం. మళ్ళీ ఈ గోల్డ్‌స్పాటు లెందుకులే అన్నాను మొహమాట పడుతూ మా ఆవిడతోనే.

క్షణంలో రెండు గోల్డ్‌స్పాటు సీసాలని మాకందించాడు ఓ కుర్రాడు. మొత్తం కూల్ డ్రింక్ తాగించిన తరువాత ఓ కాయితాన్ని నాకందించాడు షాపువాడు. మా దగ్గిర్నించి 10.800 గ్రాముల బంగారం అడ్వాన్స్‌గా తీసుకున్నట్లు ఒక గాజుకి ఆర్డర్ ఇచ్చినట్లు అందులో రాసి ఉన్నాయి. మా ఆవిడ చేతి గాజుని కూడా తీసుకొని వారం రోజుల తరువాత కొత్తగాజుతో సహా తీసుకెళ్ళమన్నాడు. ఫైనల్ బిల్లు అప్పుడిస్తామని చెప్పాడు.

పైసా ఖర్చు లేకుండా పోనీలే కొత్తగాజు వస్తోందిలే అనుకుంటూ ఇద్దరం ఆ స్వర్ణలోకంలో నుంచి కర్మ లోకంలోకి అడుగు పెట్టాం.

* * *

వారం రోజుల తరువాత ...

రసీదుని చూసి పావుగంట కూర్చోబెట్టిన తరువాత ఓ పెట్టెని తీసుకొచ్చి "ఏ లేవ్‌సాబ్" అంటూ నా ముందుంచాడు. కొత్తగాజు మెరిసిపోతూ బానే ఉందనిపించింది. "అచ్చా దేఖ్‌లేవ్ సాబ్" అంటూ పాతగాజుని కూడా నా చేతికిచ్చాడు. రెండు ఒకలానే ఉన్నాయి.

సాబ్! గాజు చేయటానికి 12 గ్రాములు కావాల్సి వచ్చింది. మీరిచ్చిన బంగారానికి మేము కలిపి చేసాం. ఇదిగో బిల్లంటూ ఓ కాయితాన్ని నాపై విసిరాడు.

| | రూ. పై. |
|---|---|
| అడ్వాన్స్‌గా ఇచ్చినది | |
| 10.800 గ్రా. = | 5,400.00 |
| గాజుకై ఎక్స్ట్రా కలిపినది 1200 గ్రా | 600.00 |
| + తరుగు = | 60.00 |
| మేకింగ్ చార్జెస్ 15% = | 900.00 |
| మొత్తం | 6,960.00 |

"తమరు రూ. 1,560/– ఇవ్వాల్సి వస్తుంది సార్" అంటూ అతి వినయంగా చెప్పాడు జర్దా కిల్లీ నములుతూ.

నా తల తిరిగిపోయింది. నేనెక్కడ ఉన్నానో నాకే తెలీటం లేదు.

"అదేమిటయ్యా మేము ఇచ్చిన బంగారంతోనే గాజు చెయ్యమంటే ఇంకా ఎక్కువ ఎందుకు కలిపావు" కాస్త గట్టిగానే అన్నాను.

"మీరిచ్చిన దాంతో అవలేదు సార్. కలపకపోతే అమ్మగారికి గాజు అవదు".

"మళ్ళీ ఈ తరుగేమిటి, మేకింగ్ చార్జీలేమిటి?" బిక్క చచ్చినట్లన్నాను.

"మళ్ళీ మేం బంగారం కలిపాం కదుసార్ దాని మీద తరుగు –సర్వీస్ చార్జీలు మామూలే కదా సార్" గొప్ప ఇన్‌ఫర్మేషన్ ఇచ్చినట్లన్నాడు.

"మీ దగ్గర బంగారానికి కూడా తరుగేమిటి?" నాకు కోపం నషాళానికి అంటుతోంది.

"ఎవరి దగ్గరున్నా బంగారానికి మలినం తప్పదు కదసార్" వేదాంతిలా నవ్వాడు. అక్కడికక్కడే ఉరి తీసుకోవాలనిపించింది ఆ క్షణంలో వాడి మాటలకి.


"అచ్చాసాబ్ పదిహేను వందలు రౌండ్ ఫిగర్ ఇచ్చేయండి" అదేదో పెద్ద కన్సిషన్ ఇచ్చేసినట్లు ధీమాగా అన్నాడు. దూరంగా సింహాసనం మీద కూర్చున్న సేట్ చంపాలాల్ శ్రీ కృష్ణ పరమాత్ముడిలా చిరునవ్వులు చిందిస్తూ కూర్చున్నాడు.

ఒరేయి చెంపాలాల్! నా చెంపలు వాయించుకునేటట్లు చేశావు. నిన్ను నిలదీసి అడిగేవాడు ఎవరూ లేకపోవటం వలనే నువ్విలా ఆబిడ్స్ అంత ఎదిగిపోయావు. పిచ్చి ఆడాళ్ళు! బంగారం అంటే ఎంతో విలువైనదని, దానితో చేయించుకున్న ఆభరణాలే తమ ఐశ్వర్యానికి గీటురాయని పిచ్చిగా కొనుక్కుని తెగమురిసిపోతూంటారు. అవసరానికి అమ్మటానికి వచ్చేసరికి దాని విలువ ఎన్ని విధాల తరిగిపోతుందో అనుభవంలో గాని తెలిసిరాదు.

ఏమయితేనేం (అగ్ర)హారం పోతే పోయింది గాని చట్టం మొత్తం తెలిసొచ్చిందన్నట్లుంది నా పరిస్థితి.

బోడి గుండు మీద కొబ్బరి కాయని కొట్టినట్లయింది షాప్‌వాడికిచ్చిన ఆ బిల్లుకి డబ్బు ఇచ్చేసరికి. స్త్రీ చిత్తం పురుషుడి భాగ్యం అంటే ఇదే కాబోలు.

నా ముందే షాపులో ఓ కొత్త జంట గోల్డ్‌స్పాటు లాగించేస్తున్నారు. పాపం పిచ్చివాళ్ళు! ఈ గోల్డ్ స్పాట్ ధర కూడా బిల్లులో కలిపేస్తారని పాపం వాళ్ళకేం తెలుసు. అంతేలే! సున్నం కొడితేగాని శుద్ధి కాదంటారు ... నిజమే మరి అనుకుంటూ బయటపడ్డాను. ●



★ రవి: క్రికెట్ చాలా కాస్ట్‌లీ గేమ్ అంటారు మా డాడీ
లలిత: కాస్ట్‌లీ గేమా ? అదెలా ?
రవి: అవును నేను మా వీధిలో క్రికెట్ ఆడుతుంటే కిటికీల అద్దాలు వీధి దీపాలు, ఇళ్ళలోని టీవీలు, బల్బులు పగిలిపోతుంటాయిగా మరి. వాటన్నింటికీ నష్టపరిహారం చెల్లించవద్దూ !

కె. కృష్ణారెడ్డి
కోమరిపాలెం